
రాయపోలు(దుబ్బాక): వడ్డేపల్లి పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు


మర్కూక్: ఎర్రవల్లి పాఠశాలలో..


సిద్దిపేట: బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న విద్యార్థులు

ముందస్తు సంబురం

పాఠశాలల్లో బతుకమ్మ సందడి

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి టీచర్లతో కలిసి కోలాటాలు, పాటలతో సందడి చేశారు.


బెజ్జంకిలో దాండియా ఆడుతున్న చిన్నారులు


గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌లో ..


దుబ్బాక పట్టణంలో..


పోతారం(ఎస్) పాఠశాలలో..



సికింద్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో..


సిద్దిపేట: బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

క్లుప్తంగా

విద్యాభివృద్ధికి నిరంతరం కృషి


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యాభివృద్ధికి ఎన్‌ఎస్‌యూఐ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామునిపట్ల ఉన్నత పాఠశాలలో నాయకులు కర్రె మధు సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అజ్జు యాదవ్, నాయకులు జయంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ విచారణ

వర్గల్(గజ్వేల్): మండలంలోని అనంతగిరిపల్లి స్కూల్‌లో ఉపాధ్యాయుడు బాలికను కొట్టిన ఘటనపై గురువారం మండల విద్యాధికారి (ఎంఈఓ) సునీత విచారణ జరిపారు. పాఠశాలను సందర్శించి ఘటనకు సంబంధించి బాధిత బాలికను, కుటుంబీకులతో పాటు విద్యార్థులు, గ్రామస్తులను విచారించారు. సంబంధిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను సైతం విచారించారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా విద్యాధికారికి అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక


మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ ఉపకార వేతనాలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 2023 విద్యా సంవత్సరంలో ఇంటర్ సెకండియర్ వార్షిక పరీక్షలు రాసి అత్యున్నతమైన మార్కులు సాధించిన శృతి, అనిత, వంశీకృష్ణ, దీపిక, మహేష్‌లు ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరికి డిగ్రీ స్థాయిలో మూడేళ్లు, పీజీలో రెండేళ్ల పాటు ప్రతి ఏడాది రూ. 10 వేల ఉపకార వేతనాలు అందుకోనున్నట్లు చెప్పారు.

తొగుట(దుబ్బాక): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రమావత్ శంకర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 2023లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థినులు కావ్య, మానస, పావని, భార్గవి, కనకలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు.

'ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని సందీప్, లోహిత్‌సాయి ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ నాయకులు గురువారం ఆస్పత్రుల ఎదుట బాధితులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 రోజుల క్రితం సిద్దిపేటలోని సందీప్ ఆస్పత్రికి పిల్లలు కావడం లేదని పాలమాకులకు చెందిన రేణుక వెళ్లగా గర్భసంచి సమస్య ఉందని అడ్మిట్ చేసుకున్నారని తెలిపారు. పరిస్థితి విషమించగా లోహిత్‌సాయి ఆస్పత్రికి మెరుగైన చికిత్స పేరుతో తరలించారన్నారు. అక్కడ గుండెపోటుతో మరణించిందని బంధువులకు చెప్పారని వాపోయారు. పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా ఇన్‌చార్జి రోమాల బాబు, అసెంబ్లీ ఇన్‌చార్జి అశోక్, నాయకులు ఉమేశ్, భాను, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

15 వేల మందిని తరలిస్తాం


మాట్లాడుతున్న ఎడ్ల సోమిరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 15వ తేదీన హుస్నాబాద్‌లో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మండలం నుంచి ప్రజలు చీమలదండులా కదిలిరావాలని ఆయిల్ ఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అంతక్కపేట గ్రామంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అశోక్‌బాబు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలోని హైమద్‌నగర్ 33 కేవీ విద్యుత్ లైన్ సరఫరాలో మరమ్మతులు జరుగుతున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని చెప్పారు.

కేసీఆర్‌ను ఆశీర్వదించండి

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్
- సభ ఏర్పాట్ల పరిశీలన


హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలో ఈనెల 15న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు, హెలిప్యాడ్ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు మండలాలు, హుస్నాబాద్ పట్టణానికి సంబంధించి ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికులుగా పని చేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, నాయకులు పాల్గొన్నారు. అలాగే బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని హుస్నాబాద్ పట్టణ ఇన్‌చార్జి మచ్చ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 2, 15వ వార్డులో సమావేశం నిర్వహించారు.

సభను జయప్రదం చేయండి

హుస్నాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ బహిరంగ సభకు గ్రామాలను నుంచి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గురువారం పొట్లపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, నాయకులు అనిల్‌గౌడ్, శ్యాంసుందర్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద ఓటుకు అవకాశం


బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

నంగునూరు(సిద్దిపేట): వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించిందని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం బూత్‌లెవల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్త నిబంధనల ప్రకారం 80 ఏళ్లు నిండిన వృద్ధులకు ఫాం 12డీ అందజేసి సంతకం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణి పాల్గొన్నారు.

జీపీ పనుల నిమిత్తం కోసమే..

సాక్షి స్పందన

సిద్దిపేటరూరల్: 'సార్‌బండి.. సర్కార్ కరెంటండి' పేరుతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మండల పంచాయతీ అధికారి స్పందించారు. మాటిండ్ల సర్పంచ్, సెక్రటరీ నుంచి వివరాలు సేకరించారు. ఎలక్ట్రిక్ వాహనాన్ని సిబ్బంది గ్రామ పంచాయతీ అవసరానికి వాడుకుంటున్న క్రమంలో చార్జింగ్ అయిపోవడంతో అక్కడే కొద్దిసేపు చార్జింగ్ పెట్టానని సర్పంచ్ నారాయణ లేఖ ద్వారా అధికారికి వివరణ ఇచ్చారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి వివరణ ఇస్తూ తన ఎలక్ట్రిక్ స్కూటీ స్టార్ట్ కాకపోవడంతొ చార్జింగ్ పెట్టానని తెలిపారు.

'కేసులు ఉపసంహరించుకోవాలి'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డితో పాటు మరి కొంతమంది నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు పెట్టిన అట్రాసిటీ కేసులను ఉపసరింహరించుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట నూతన రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జరిగిన సంఘటనలో తప్పు చేసిన బీఆర్‌ఎస్ నాయకులను వదిలేసి బీజేపీ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు జనార్దన్, అనిల్, రాజు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీదే

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని అచ్చుమాయిపల్లి, ఆరెపల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీసీని దేశానికి ప్రధానిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. గొల్ల, కురుమలు డీడీలు కట్టి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు గొర్రెలను అందించలేదని విమర్శించారు. ప్రభుత్వ పథకాలతో బీఆర్‌ఎస్ కార్యకర్తలే బాగుపడ్డారని ఆరోపించారు. మంత్రి హరీశ్‌రావు దుబ్బాక, సిద్దిపేట రెండు కళ్లలాంటివని మాయమాటలు చెప్పి దుబ్బాక అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, అనిల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తాం


మాట్లాడుతున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆపార్టీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పంక్షన్‌హాల్‌లో నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో నాయకులు గురువారెడ్డి, అనూష్, నాగేందర్‌రెడ్డి, లింగం,కృష్ణ, స్వామి, భిక్షపతి, కరుణాకర్, రాంరెడ్డి, కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు


పార్టీలో చేరిన వారితో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌లో వివిధ పార్టీలకు చెందిన 20 మంది కార్యకర్తలు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మండల పరిధిలోని ధర్మారంలో పెద్దమ్మ, మహంకాళి ఆలయాల్లో ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి మధిర గ్రామం మాదన్నపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, సర్పంచ్ పన్యాల వెంకట్‌రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు


మిరుదొడ్డిలో పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీం

మిరుదొడ్డి(దుబ్బాక): అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గురువారం మండల కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం చందన పరిశీలించారు. గోడలపై రాసి ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన రాతలను, పోస్టర్లను పరిశీలించారు. పార్టీలకు సంబంధించిన జెండాలు, గుర్తులు ఉంటే వెంటనే తొలగించాలని ఎంపీడీఓ రాజిరెడ్డికి, పంచాయతీ సెక్రటరీకి సూచించారు. కోడ్‌ను దిక్కరించిన పార్టీల నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'బహిరంగ సభను అడ్డుకుంటాం'


మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

హుస్నాబాద్: పట్టణంలో ఈనెల 15వ తేదీన నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభను అడ్డుకొని ప్రజా సమస్యలపై సీఎం కేసీఆర్, ప్రభుత్వ పెద్దలను ప్రశ్నిస్తామని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీబంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు పలు రకాల పథకాలు 70 శాతం పైచిలుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇచ్చి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రాగుల శ్రీనివాస్, నాయకులు హరికృష్ణ, సుజిత్, శ్రావణ్, సృజన్, శ్రీమన్, తదితరులు పాల్గొన్నారు.

జీఎం ప్రత్యేక పూజలు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రాన్ని గురువారం బరోడా బ్యాంక్ జనరల్ మేనేజర్ రితీష్‌కుమార్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు మహదాశీర్వచనం చేశారు. శేషవస్త్రంతో సన్మానించారు. ఆయన వెంట రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ మౌనిక ఉన్నారు.


వర్గల్ క్షేత్రంలో జీఎం రితీష్‌కుమార్ తదితరులు

దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న బీజేపీ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): అర్హులైన విశ్వకర్మలు నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని లద్నూరులో పథకంపై పలువురికి అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకంలో 18 రకాల బీసీ కులస్తులకు రూ. 3 లక్షలు అందజేస్తారని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌గౌడ్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్‌ఎస్‌కు మద్దతుగా తీర్మానం



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్లలో మహిళా సంఘాల సభ్యులు గురువారం మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. తమ ఓట్లు హరీశ్‌రావుకే వేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బెజ్జంకి తహసీల్దార్‌గా శ్యాం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి తహసీల్దార్‌గా ఎర్రోల్ల శ్యాం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బెజ్జంకి మండలానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకట్‌రెడ్డి ఇటీవల బదిలీపై దుబ్బాకకు వెళ్లారు.

సన్మానం

నంగునూరు(సిద్దిపేట): పాఠశాలకు వాటర్‌ప్లాంట్‌ను బహూకరించిన దాతను గురువారం గట్లమల్యాల గ్రామస్తులు సన్మానించారు. విద్యార్థులకు తాగునీటి వసతులు కల్పించేందుకు గ్రామానికి చెందిన పుట్ట వెంకన్న మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. నీటి వసతి కల్పించిన వెంకన్నను ఆయిల్‌పామ్ ఫార్మర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, కర్ణకంటి వేణుగోపాల్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు సన్మానించారు.

కాంగ్రెస్‌కు పలువురి రాజీనామా

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట కాంగ్రెస్ కమిటీకి నాయకులు శ్రావణ్ కుమార్, వినయ్, అఫ్సర్, సోహెల్, అన్వర్ రాజీనామా చేశారు. గురువారం నాడు వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి వర్గం నాయకులు తమకు తెలియకుండా పార్టీ కార్యకలాపాలు చేపడుతున్నారని మండిపడ్డారు.

బీసీని సీఎంగా ప్రకటించాలి



అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీ నాయకులను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం అక్కన్నపేటలో బీసీల సమస్యలపై ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి అనంత స్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

వర్గల్(గజ్వేల్): పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో గురువారం మండలంలోని అనంతగిరిపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ మోహన్‌లాల్, సృజన పశువులకు పరీక్షలు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ సునీత శిబిరం ప్రారంభించారు.

పరామర్శ

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి దొంగల రాజిరెడ్డి తండ్రి మృతిచెందగా గురువారం వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సంతోష్, రెడ్డి జేఏసీ నాయకులు బాపురెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రామకోటి స్తూపానికి స్థలం కేటాయించాలి

గజ్వేల్‌రూరల్: రామకోటి స్తూప నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు కప్పర ప్రసాదరావు పేర్కొన్నారు. పట్టణంలో రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు గురువారం ప్రసాదరావుకు రామకోటి పుస్తకాన్ని అందజేశారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

నంగునూరు(సిద్దిపేట): ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎస్‌ఐ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రాజగోపాల్‌పేట ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దేశ్‌పాండే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్ బుక్స్, నోట్స్ అందజేశారు. హెచ్‌ఎంలు, సంస్థ ప్రతినిధి యాదగిరి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే టికెట్ కేటాయించండి'

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌టీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని గురువారం దరఖాస్తు చేసుకున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు లోటస్‌పాండ్‌లో పార్టీ నాయకులకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.